సాక్షి గుంటూరు

శుక్రవారం, 29, మార్చి, 2024



వైభవంగా తిరునాళ్ల

శావల్యాపురం: పోట్లూరు శివారులో ఉన్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్యల తిరునాళ్లను గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు.



మహంకాళి అమ్మవారి తిరునాళ్ల

నరసరావుపేటరూరల్: ఇస్సప్పాలెంలో మహంకాళి అమ్మవారి ఆలయ వార్షిక మహోత్సవాన్ని గురువారం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్ర)	సహరి (శని)
గుంటూరు	6.25	4.48
నరసరావుపేట	6.27	4.50
బాపట్ల	6.25	4.49

న్యూస్‌రీల్

ఏఎస్‌ఐ, కానిస్టేబుల్ బదిలీ

సాక్షి ఎఫెక్ట్

మంగళగిరి: ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న ఏఎస్‌ఐ ఏడుకొండలు, ఎస్బీ కానిస్టేబుల్ శ్రీనివాసరావులను ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఏఎస్‌ఐ పనితీరు వివాదాస్పదం అనే శీర్షికన ఈనెల 27వ తేదీ సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన కథనంపై స్పందించిన ఉన్నతాధికారులు ఏఎస్‌ఐ, ఎస్బీ కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకున్నారు. వీరు టీడీపీకి అనుకూలంగా పనిచేస్తున్నారంటూ వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టిన అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక అందిజేశారు. ఉన్నతాధికారులు వెంటనే ఏఎస్‌ఐ ఏడుకొండలును హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. పట్టణ ఎస్బీ కానిస్టేబుల్ శ్రీనివాసరావును గుంటూరు కార్యాలయానికి బదిలీ చేశారు. ఎన్నికల విధులలో ఏకపక్షంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఉన్నతాధికారులు హెచ్చరించారు.

హాస్పటల్స్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

గుంటూరుమెడికల్: జిల్లాలో ప్రైవేట్ క్లినిక్‌లు, నర్సింగ్ హోమ్‌లు, డెంటల్ క్లినిక్, ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు తప్పనిసరిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి కార్యాలయంలో తమ ఆసుపత్రులను రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయించుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. రిజిస్ట్రేషన్, లేదా రెన్యువల్ లేకుండా ఆసుపత్రిలో వైద్య సేవలు, కార్యకలాపాలు నిర్వహించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మత్స్యవతారంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు



మంగళగిరి: మంగళగిరి నగరంలోని లక్ష్మీ నృసింహ స్వామి ఆస్థాన అలంకారోత్సవములు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు స్వామి వారు శ్రీదేవి భూదేవి సమేతుడై మత్స్యవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించగా ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి ఉత్సవాన్ని పర్యవేక్షించారు. ఉత్సవానికి కైంకర్యపరులుగా హైదరాబాద్‌కు చెందిన దూర్జటి మధుసూదనరావు, చెంచు వెంకటసుబ్బారావులు వ్యవహరించగా ఆస్థాన కైంకర్యపరులుగా మంగళగిరికి చెందిన ఇనుమన మిళ్లారి శ్రీరామచంద్రశర్మ, కృష్ణవేణి దంపతులు వ్యవహరించారు.

అమరేశ్వరుని సేవలో ఉత్తరాఖండ్ స్వామీజీలు



అమరావతి: ప్రసిద్ధ శైవక్షేత్రమైన అమరావతి అమరేశ్వరస్వామిని గురువారం పలువురు పీఠాధిపతులు దర్శించారు. తొలుత ఉత్తరాఖండ్ జ్యోతిర్మఠ్ పీఠాధిపతి, శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ మెంబర్ స్వామి వాసుదేవానంద సరస్వతీజీ మహారాజ్, శ్రీపీఠాధిపతి బ్రహ్మానంద సరస్వతీజీ మహరాజ్, ఉత్తరాఖండ్ నాంతాన్ బాబాఆశ్రమం శంకర్‌దేవ్‌జీమహారాజ్, సాధు సందర్శన సమితి జాతీయ అధ్యక్షులు భారతీ స్వామిలకు ఆలయ మర్యాదలలో ఈవో వేమూరి గోపినాధశర్మ, అర్చకులు, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామిజీ అమరేశ్వరునికి, బాలచాముండేశ్వరీ అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వెంకటాద్రినాయుని మండపంలో స్వామిజీలు భక్తులను ఆశీర్వదించి అనుగ్రహభాషణం చేశారు. ఆలయ అర్చకులు స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను స్వామిజీలకు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

యార్డులో 1,12,869 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,03,020 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,12,869 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.20,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 21,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది.

దొంగ దొరికాడు !

ఎన్నికలవేళ టీడీపీ తాయిలాలు

- ఆ పార్టీ పొన్నూరు అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర ఫొటో స్టిక్కర్లతో ఉన్న 567 సైకిళ్లు స్వాధీనం చేసుకున్న అధికారులు
- ఓటర్లకు పంపిణీ చేసేందుకు ఆయన స్వగ్రామం చింతలపూడిలో దాచినట్టు సమాచారం అందించిన స్థానికులు





పంపిణీ చేసేందుకు టీడీపీ సిద్ధం చేసిన సైకిళ్లు,(ఇన్‌సెట్‌లో) సైకిళ్లపై అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర స్టిక్కర్లు ఉన్న దృశ్యం

పొన్నూరు: పొన్నూరు నియోజకవర్గంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసి, తాయిలాల ఎరవేసి ఓట్లు దక్కించుకునేందుకు టీడీపీ పన్నాగం పన్నింది. విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేసి తల్లిదండ్రుల మెప్పుపొందేందుకు భారీ సంఖ్యలో సైకిళ్లను కొనుగోలు చేసింది. టీడీపీ అభ్యర్థి ధూళిపాళ్ల స్వగ్రామం చింతలపూడిలోని ఓ రైస్‌మిల్లులో నిల్వ చేశారు. సమాచారం అందుకున్న ఎన్నికల అధికారులు వాటిని సీజ్ చేశారు. శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు పొన్నూరు నియోజకవర్గం ఎన్నికల అధికారులకు ఫోన్ చేశారు. మండలంలోని చింతలపూడి గ్రామంలోని ఓ రైస్‌మిల్‌లో టీడీపీ నేత, ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర ఫొటో, సైకిల్ గుర్తుతో ఉన్న నూతన సైకిళ్లు వందల సంఖ్యలో ఉన్నాయని సమాచారం అందింది. వెంటనే అధికారులు హుటాహుటిన రైస్‌మిల్‌కు చేరుకుని వందల సంఖ్యలో ఉన్న సైకిళ్లను చూసి అవాక్కయ్యారు. అన్ని సైకిళ్లకు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ రంగు, గుర్తులు, అభ్యర్థి ఫొటో ఉండటంతో అన్ని సైకిళ్లను సీజ్ చేశారు. సంఘటనా స్థలానికి ఓ వ్యక్తి చేరుకుని తాను కోర్టు ద్వారా ఆక్షన్‌లో సైకిళ్లను దక్కించుకున్నానని, అధికారులకు తెలిపాడు. అయితే ఎన్నికల నియమావళికి వ్యతిరేకంగా సైకిళ్లు ఉన్నాయని, ఒకేచోట పార్టీ సింబల్స్‌తో ఇన్ని సైకిళ్లు ఉండరాదని తేల్చిచెప్పారు. కోడ్ ఉల్లంఘించిన కారణంగా 567 సైకిళ్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఫ్లెయింగ్ స్క్వాడ్ అధికారి వరదరాజులు, ఏంపీడీవో రత్నజ్యోతి తెలిపారు. ధూళిపాళ్ల నరేంద్ర ఎన్నికల తాయిలాల పంపకంతోనే విజయం సాధించే ప్రక్రియకు ఎన్నికల అధికారులు అడ్డుకట్ట వేశారు.

బాధితుడికి 'స్నేహ హస్తాలు'

గుండె శస్త్రచికిత్సకు ఆర్థిక సాయం అందజేత



శ్రీనివాసరావు భార్య సాజన్యకు చెక్కు అందజేస్తున్న దండమూడి విజయ్

గుంటూరుఎడ్యుకేషన్: స్నేహానికి మించిన బంధం మరేది ఉండదని అది ఖండాంతరాలు దాటినా వారి హృదయాలలో పదిలంగా ఉంటుందని మరోసారి చాటి చెప్పారు 'స్నేహ హస్తాలు' స్వచ్ఛంద సంస్థ మిత్రులు. బాపట్ల జిల్లా అమృతలూరు మండలం ప్యాపర్రు గ్రామానికి చెందిన పేద పూజారి పొన్నూరు శ్రీనివాసరావు గుండెజబ్బుతో బాధపడుతున్నారు. ఆయన గుండెకు వాల్స్ మూసుకుపోయి, అత్యవసరంగా శస్త్రచికిత్స చేయాల్సి ఉంది. ఈ విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన ఎన్నారై గడ్డిపాటి షర్మిల స్పందించి స్నేహహస్తాలు సభ్యురాలిగా తన తోటి స్నేహితుల సహకారంతో రూ.తొమ్మిది లక్షలు ఆర్థిక సహాయాన్ని ట్రస్టీ దండమూడి విజయ్ ద్వారా భార్య సాజన్య, కుటుంబ సభ్యులకు గురువారం గుంటూరు అరండల్‌పేటలోని బంధువుల ఇంట్లో అందజేశారు. ట్రస్టీ దండమూడి విజయ్ మాట్లాడుతూ 20 ఏళ్ల కిందట సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లతో 'స్నేహ హస్తాలు' స్వచ్ఛంద సంస్థను కుల, మతాలకతీతంగా సేవా దృక్పథంతో ఏర్పాటు చేశామన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో 202 పాఠశాలలను దత్తత తీసుకుని 12,500 మంది విద్యార్థులకు ఆర్థిక సహకారం అందించటం ద్వారా జీవితంలో స్థిరపడేటట్లు చేశామని చెప్పారు. వారిలో అనేకమంది తిరిగి స్నేహ హస్తాలకు సపోర్టు ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు పర్యావరణ పరిరక్షణ వంటి చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ ఎంవీ రావు, కార్యదర్శి ఎ.బాలమురళీకృష్ణ, కోఆర్డినేటర్ టి.కరీముల్లా, ఎం.రాధికారాణి, జీపీ హరి, కౌశిక, ఇందుప్రియ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎన్నికల ప్రచారంలో జీఎంసీ ఉద్యోగి

పట్టించుకోని అధికారులు



ఎన్నికల ప్రచారంలో టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని, ఈస్ట్ అభ్యర్థి నసీర్‌తో పాల్గొన్న వసీంఅలీ

పట్నంబజారు: ఎన్నికల నిబంధనావళికి విరుద్ధంగా నగర పాలక సంస్థ ఉద్యోగి ఒకరు టీడీపీ నేతలతో కలసి ప్రచారం నిర్వహిస్తున్నాడు. మొహమ్మద్ వసీం అలీ 2010 సంవత్సరం ముందుగానే జీఎంసీలో అటెండర్‌గా చేరారు. ప్రస్తుతం రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. తన తండ్రి మరణించిన తర్వాత కారుణ్య నియామకాల్లో ఉద్యోగం వచ్చింది. మాయాబజారు సమీపంలోని టీడీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎండీ నసీర్ అహ్మద్ నివాసానికి సమీపంలో ఉండే వసీం టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, అసెంబ్లీ అభ్యర్థి నసీర్ అహ్మద్‌తో కలసి నిత్యం ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. దీనిపై ఎన్నికల కమిషన్, జీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రేపు గుంటూరు రానున్న ఈవీఎంలు

నెహ్రూనగర్: ఎన్నికల సంఘం గుంటూరు నగర పాలక సంస్థకు కేటాయించిన ఈవీఎంల్లో కొన్నింటిని గతేడాది పల్నాడు, బాపట్ల జిల్లాలకు ఇచ్చామని, ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో గుంటూరుకి అవసరమున్నందున వాటిని తిరిగి ఆయా జిల్లా అధికారులు శనివారం అందించనున్నారని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఏడాది మే నెలలో రాష్ట్ర ఎన్నికల సంఘం, గుంటూరు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనుమతితో గుంటూరు నగరపాలక సంస్థకు ఎన్నికల సంఘం కేటాయించిన ఈవీఎంల్లో 100 పర్చూరు మండలానికి అక్కడ జెడ్పీటీసీ ఎన్నికల అవసరాల కోసం పంపామని తెలిపారు. కేటాయించిన 100 ఈవీఎంలు వారికి ప్రస్తుతం అవసరం లేనందున వాటిని తిరిగి గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కి ఇచ్చేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆమోదించినందున శనివారం మున్సిపల్ కార్పొరేషన్, గుంటూరు పరిధిలో గల ఈవీఎంల గోడౌన్‌లో గుర్తింపు పొందిన రాష్ట్ర, జాతీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో భద్రపరుచుటకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.



ప్రశాంతంగా గుంటూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు

ఓటు హక్కు వినియోగించుకున్న న్యాయవాదులు



ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన న్యాయవాదులు



ఓటు హక్కు వినియోగించుకుంటున్న బ్రహ్మారెడ్డి

నగరంపాలెం: ది గుంటూరు బార్ అసోసియేషన్ పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. గురువారం నగరంపాలెం జిల్లా కోర్టు ఆవరణలోని అసోసియేషన్ కార్యాలయంలో ఓటింగ్ ప్రక్రియ ఉదయం పది గంటలకు మొదలైంది. ఈలోగా ఓటర్లు (న్యాయవాదులు), పదవుల రేసులో ఉన్న అభ్యర్థులు, వారికి మద్దతు పలికే వారితో సందడి వాతావరణం నెలకొంది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చే వారిని అభ్యర్థుల మద్దతుదారులు ప్లకార్డులు, కరపత్రాలు చేతపట్టుకుని ఓట్లు అభ్యర్థించారు. పోలింగ్ ప్రశాంతంగా కొనసాగేందుకు మూడు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. పోలింగ్ ఉదయం 10 గంటలకు ప్రారంభమవ్వగా, సాయంత్రం 4.30గంటలకు ముగిసింది. తాజా, మాజీ అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాదులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. బార్ అసోసియేషన్ పరిధిలో 1,942 మంది న్యాయవాదులు ఉండగా, 1,605 మంది ఓటు హక్కుని వినియోగించుకున్నారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు షామియానాలు, తాగునీటి వసతి కల్పించారు. సీసీ కెమెరాలకు అనుసంధానంగా ఎల్‌ఈడీ టీవీలను ఏర్పాటు చేశారు. పలువురు న్యాయవాదులు ఎల్‌ఈడీల ద్వారా ఎన్నికల సరళిని వీక్షించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా నగరంపాలెం పీఎస్ సీఐ లోక్‌నాథం, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

జీబీఏ అధ్యక్షునిగా కాసు వెంకటరెడ్డి విజయం

విజయోత్సవ సంబరాలు



నగరంపాలెం: ది గుంటూరు బార్ అసోసియేషన్(జీబీఏ) అధ్యక్షునిగా కాసు వెంకటరెడ్డి ఎన్నికయ్యారు. ఆయన సమీప అభ్యర్థి వెంగలశెట్టి శివ సూర్యనారాయణ (బబ్లూ)పై ఆరు ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఎన్నికల పోలింగ్ ప్రక్రియ, ఓట్ల లెక్కింపు రాత్రి ఏడు గంటలకు మొదలై అర్ధ రాత్రి 12 గంటలకు ముగిసింది. ఈ క్రమంలో అధ్యక్ష పదవికి కాసు వెంకటరెడ్డి, యంగలశెట్టి శివసూర్యనారాయణ (బబ్లూ) పోటీపడ్డారు. నువ్వా, నేనా అనే రీతిలో ఇరువురు బరిలోకి దిగారు. ఎన్నికల ప్రక్రియ మొదలైన దగ్గర నుంచి కాసు వెంకటరెడ్డి వైపు ఓటర్లు (న్యాయవాదులు) ఉన్నారనే బలాన్ని గెలుపు ద్వారా రుజువైంది. ఉదయం మొదలైన పోలింగ్ ప్రక్రియ నుంచి కాసు వెంకటరెడ్డి గెలుస్తారనే ప్రచారం అందరిలో నెలకొంది.

క్లుప్తంగా

నేడు ఉమేష్‌చంద్ర జయంతి

తెనాలిరూరల్: దివంగత ఐపీఎస్ అధికారి చదలవాడ ఉమేష్ చంద్ర 58వ జయంతిని కుటుంబ సభ్యులు శుక్రవారం తెనాలిలో నిర్వహించనున్నారు. చెంచుపేటలోని ఉమేష్ చంద్ర విగ్రహం వద్ద ఉదయం తొమ్మిది గంటలకు జరుగనున్న జయంతి కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ, సీనియర్ ఐపీఎస్ అధికారి ద్వారకా తిరుమల రావు, ఇతర అధికారులు పాల్గొంటారని కుటుంబ సభ్యులు గురువారం తెలిపారు.

పీజీ విద్యార్థికి తీవ్రగాయాలు

యడ్లపాడు: ముందు వాహనాన్ని తప్పించే క్రమంలో కారు ప్రమాదానికి గురై మంగళగిరి ఎన్నారై మెడికల్ కళాశాల పీజీ ద్వితీయ సంవత్సరం వైద్య విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం ఖమ్మం జిల్లా బ్యాంకు కాలనీకి చెందిన మద్దినేని పవన్‌కృష్ణ మంగళగిరి ఎన్నారై మెడికల్ కళాశాలలో జనరల్ మెడిసిన్ విభాగంలో ద్వితీయ సంవత్సరం పీజీ చేస్తున్నాడు. గురువారం తిరుపతి నుంచి ఎన్నారైకు కారు డ్రైవ్ చేస్తూ వస్తున్న సమయంలో యడ్లపాడు మండలం తిమ్మాపురం పరిధిలోని వసంత నూలు మిల్లు ఎదురుగా హెవీ లోడు లారీని తప్పించే క్రమంలో అదుపు తప్పిన కారు లారీ వెనుక భాగాన్ని కొన్నాడు. ఎయిర్ బ్యాగులు ఓపెన్ అయినప్పటికీ కారులో ఉన్న పవన్ కృష్ణ తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంగళగిరి ఎన్నారైకు తరలించారు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న యడ్లపాడు ఎస్సై జె.శామ్యూల్ రాజీవ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

- 18 మంది అరెస్టు
- రూ.2.21 లక్షలు స్వాధీనం

పర్చూరు (చినగంజాం): పర్చూరు పరిధిలోని ఓ పేకాట శిబిరంపై బాపట్ల పోలీసులు మెరుపు దాడి చేశారు. జిల్లా పోలీసు కార్యాలయానికి అందిన రహస్య సమాచారంతో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ, రూరల్ ఎస్‌ఐ శ్రీహరి ఆధ్వర్యంలో గురువారం వేకువజామున సుమారు 20 మంది పోలీసులు మండలంలోని వీరన్నపాలెం గ్రామ శివారు పొలాల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేశారు. 18 మందిని అరెస్టు చేయడంతోపాటు వారి వద్ద నుంచి రూ.2.21 లక్షలతోపాటు తొమ్మిది ద్విచక్ర వాహనాలు, 18 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దాడి అనంతరం వారిని పర్చూరు పోలీసు స్టేషన్‌కు అప్పగించారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరువెస్ట్: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జూన్ చివరి వరకు సంబంధిత శాఖలు యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలన్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకులన్నీ తాగునీటితో పూర్తిగా నింపాలన్నారు. తాగునీటి పథకాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు ప్రతిరోజూ తాగునీటి సరఫరాను పరిశీలిస్తూ ఇబ్బందులను సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. తాగునీటి ఎద్దడి గ్రామాలకు, శివారు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా క్రమం తప్పకుండా నీటి సరఫరా చేయాలని తెలిపారు. పనిచేయకుండా ఉన్న బోర్లకు మరమ్మతులు చేసి వాటిని ఉపయోగంలోకి తీసుకురావాలని సూచించారు. నాగార్జునసాగర్ కుడి కెనాల్ ద్వారా తాగునీటి చెరువులకు వచ్చే నెల 8న నీటిని విడుదల చేసే అవకాశం ఉందన్నారు. చివరి గ్రామాల వరకు నీటిని పూర్తిస్థాయిలో నింపుకునేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కెనాల్స్ నుంచి వచ్చే నీటిని వృథా కాకుండా చూసుకోవడంతోపాటు సద్వినియోగం చేసుకోవడానికి పంట పొలాల్లోకి నీరు వెళ్లకుండా షెట్టర్లను ముందస్తుగా మూసేయాలన్నారు. నీరు అడ్డంకులు లేకుండా ప్రవహించేందుకు వచ్చే నెల 5లోపు పూర్తిస్థాయి చర్యలు చేపట్టాలని చెప్పారు. గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి నగర పాలక సంస్థలతోపాటు తెనాలి, పొన్నూరు మున్సిపాలిటీల అధికారులు తాగునీటి విషయంలో నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇబ్బందికర పరిస్థితులను కూడా అధిగమించేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సురేష్, ఇరిగేషన్ ఎస్‌ఈ ఉమామహేశ్వరరావు, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ ఎస్‌ఈ శ్రీనివాస్, నగర పాలక సంస్థ ఎస్‌ఈ శ్యాంసుందర్ అధికారులు పాల్గొన్నారు.

తనిఖీల్లో సీజ్ చేసిన వస్తువులు జాగ్రత్తగా భద్రపరచాలి: కలెక్టర్

ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఇప్పటి వరకు సీజ్ చేసిన డబ్బు, వస్తువులు తదితర అంశాలను జాగ్రత్తగా భద్రపరచుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో జిల్లా స్థాయి గ్రీవెన్స్ రీడ్రెసెల్ కమిటీ (సీజర్స్) సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ వస్తువులకు సంబంధించిన ఫిర్యాదులను కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, కమిటీ కన్వీనర్ హరిహరనాథ్, సభ్యులు శివరామకృష్ణ, జిల్లా ఖజానా శాఖాధికారి బి.రాజగోపాల్‌రావు, ఐటీ నోడల్ బృందం పాల్గొంది.

అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను జాగ్రత్తగా పరిశీలించాలి

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల ఖర్చులను సంబంధిత కమిటీలు జాగ్రత్తగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయపార్టీలు, అభ్యర్థుల రోజువారీ ఖర్చులను ఎన్నికల సంఘం నిర్దేశించిన ఫార్మేట్స్‌లో కమిటీ సభ్యులు సమర్థంగా నమోదు చేయాలన్నారు. అసిస్టెంట్ ఎక్స్‌పెండీచర్ అబ్జర్వర్లు ఎఫ్‌ఎస్టీ, ఎస్‌ఎస్టీ, వీడియో సర్వైలెన్స్ తదితర బృందాలను సమన్వయం చేసుకుంటూ అభ్యర్థుల ప్రచార ఖర్చులను నమోదు చేయాలన్నారు. నిర్దేశించిన ఫార్మేట్స్‌లో నివేదికలను ప్రతి రోజూ రిటర్నింగ్ అధికారికి, జిల్లా స్థాయి ఎక్స్‌పెండీచర్ మానటరింగ్ సెల్‌కు అందించాలన్నారు. ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు ఉపయోగించే అన్ని రకాల వస్తువులకు ఖర్చులను నమోదు చేయాలన్నారు. అసిస్టెంట్ ఎక్స్‌పెండీచర్ అబ్జర్వర్లు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ రాజకీయపార్టీలు చేస్తున్న ఖర్చులను అకౌంటింగ్ టీమ్ ద్వారా నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, కమిటీ కన్వీనర్ హరిహరనాథ్, సభ్యులు శివరామకృష్ణ, జిల్లా ఖజానా శాఖాధికారి బి.రాజగోపాల్‌రావు, ఐటీ నోడల్ టీం బృందం పాల్గొంది.

అనధికారిక నగదు జప్తు


స్వాధీనం చేసుకున్న నగదుతో అధికారులు

తాడికొండ: మండల పరిధిలోని కొర్రపాడు చెక్ పోస్టు వద్ద గురువారం అనధికారికంగా తరలిస్తున్న రూ. 9.50 లక్షల నగదు మేడికొండూరు సీఐ దార్ల జయకుమార్ స్వాధీనం చేసుకున్నారు. సీఐ జయకుమార్ మాట్లాడుతూ సత్తెనపల్లి గ్రామానికి చెందిన గంగూరి రామచంద్రరావు తన కారులో గుంటూరు నుండి సత్తెనపల్లి వెళుతున్న సమయంలో కొర్రపాడు చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న సమయంలో కారులో రూ. 9.50 లక్షల నగదు పోలీసులు గమనించారు. సదరు వ్యక్తిని నగదు వివరాలు చెప్పమని ప్రశ్నించారు. సరైన సమాధానం చెప్పకపోవడంతో నగదు సీజ్ చేసినట్లు సీఐ జయకుమార్ తెలిపారు.

నాజ్‌సెంటరులో రూ. 2.66 లక్షలు..

పట్నంబజారు: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా నగదు కలిగి ఉన్న వ్యక్తులపై కేసు నమోదు అయింది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం నాజ్‌సెంటర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో రైలుపేటకు చెందిన తాతా ఉదయ భాస్కర్‌రావు, అమ్మిశెట్టి మల్లికార్జునరావు ఇరువురి వద్ద రూ. 2,66,800లు గుర్తించారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దేవదాయ శాఖ ఈవో సస్పెన్షన్

చీరాల: సత్రానికి సంబంధించిన నగదును సొంతానికి వాడుకున్న దేవదాయ శాఖ ఈవోను అధికారులు సస్పెండ్ చేశారు. కనక నాగవరపమ్మ అమ్మవారి దేవస్థానం ఈవో జి.వి.ఎల్.కుమార్ చీరాలలోని దేవదాయ శాఖ సత్రం అధికారిగా పని చేస్తున్నారు. కొన్ని నెలల కిందట సత్రానికి సంబంధించిన బ్యాంకు అకౌంట్‌లో ఉన్న రూ.32 లక్షలను ఎవరికి చెప్పకుండా డ్రా చేసుకున్నాడు. విషయం తెలిసిన కమిటీ సభ్యులు ఇటీవల దేవదాయ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రాథమికంగా విచారణ చేపట్టిన అధికారులు, దేవదాయ శాఖ డెప్యూటీ కమిషనర్ ఇచ్చిన నివేదిక మేరకు కమిషనర్ గురువారం ఈవో కుమార్‌ను సస్పెండ్ చేశారు. అనంతరం విచారణ కమిటీని నియమిస్తారని డెప్యూటీ కమిషనర్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్ ఆదేశం


వల్లభాపురంలో పోలింగ్ స్టేషన్లను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్

కొల్లిపర: అన్ని పోలింగ్ స్టేషన్లలో ఓటర్లకు సౌకర్యాలు కల్పించాలని తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్ ఆదేశించారు. మండలంలోని దావులూరిపాలెం, కొల్లిపర, గుదిబండివారిపాలెం, వల్లభాపురం ఆయా గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను గురువారం తహసీల్దార్ ఎస్.శ్రీనివాసులతో కలసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రతి పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు కూడా పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగులు విధులు నిర్వహించాలని, పోలింగ్ బూత్‌లు వద్ద ఎటువంటి అవరోధాలు ఉన్నా సిబ్బంది వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎస్‌ఐ ఆర్ రవీంద్రరెడ్డి, ఎంపీడీవో విష్ణుప్రసాద్, ఆర్‌ఐ శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావు (సాయి), ఈవోఆర్డీ పూర్ణశంకర రావు, మండల పరిషత్ పరిపాల ఏవో చంద్రమోహన్ , బీఎల్‌ఓలు, వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బేతంచర్ల-బుగ్గనపల్లి మధ్య రైల్వే లైను ప్రారంభం

- అందుబాటులోకి గుంతకల్లు-బుగ్గనపల్లి మధ్య 113 కిలోమీటర్ల డబుల్ లైను
- వివరాలు వెల్లడించిన డీఆర్‌ఎం రామకృష్ణ




విద్యుదీకరణతో రూపుదిద్దుకున్న గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ లైను

లక్ష్మీపురం: ప్రస్తుతం కొనసాగుతున్న గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ ప్రాజెక్టుపై దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులను వేగవంతం చేసినట్లు గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్‌ఎం రామకృష్ణ తెలిపారు. స్థానిక పట్టాభిపురంలో గుంటూరు డివిజనల్ మేనేజర్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని బేతంచెర్ల-బుగ్గనపల్లి సిమ్మెంట్‌నగర్ మధ్య మరో 6.2 కిలోమీటర్ల మేర సెక్షన్‌ను విద్యుదీకరణతో పాటు డబుల్ లైన్ పనులు పూర్తి చేసి ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ విభాగం ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్, నంద్యాల జిల్లాల్లోకి వస్తుందని తెలిపారు. ప్రస్తుతం ఈ సెక్షన్‌ను డబ్లింగ్ చేయడంతో గుంతకల్లు-బుగ్గనపల్లి మధ్య 113 కిలోమీటర్ల వరకు విద్యుదీకరణతో పాటు నిరంతర డబుల్ లైన్ సౌకర్యం ఉంటుందని తెలిపారు. గుంటూరు-గుంతకల్లు సెక్షన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు నగరాన్ని రాయలసీమ ప్రాంతంతో అనుసంధానించే కీలకమైన రైలు మార్గం అన్నారు. ఈ లైన్ గుంటూరు, ప్రకాశం, పల్నాడు, నంద్యాల, కర్నూలు జిల్లాలల్లోని మారుమూల ప్రాంతాలను కలుపుతుందన్నారు. ఈ విభాగంలో రద్దీని తగ్గించడానికి గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ విద్యుదీకరణ ప్రాజెక్ట్ 2016లో సుమారు రూ.3,887 కోట్ల అంచనా వ్యయంతో 401 కిలోమీటర్ల దూరం కోసం మంజూరు చేయబడిందన్నారు. ఇప్పటి వరకు నల్లపాడు-గిద్దలూరు మధ్య 200 కిలోమీటర్ల మేర, బేతంచెర్ల-గుంతకల్లు మధ్య 107 కిలోమీటర్ల మేర డబ్లింగ్ విద్యుదీకరణతో మొత్తం 307 కిలోమీటర్ల ప్రాజెక్ట్ పూర్తయ్యి ప్రారంభించబడిందని తెలిపారు. ఇప్పుడు బేతంచెర్ల-బుగ్గనపల్లి మధ్య మరో 6 కిలోమీటర్ల మేర పనులు పూర్తి కావడంతో గుంటూరు-గుంతకల్లులోని వివిధ విభాగాలలో మొత్తం 313 కిలోమీటర్ల మేర రెండవ లైన్‌తో పాటు విద్యుదీకరణ పూర్తి అయిందన్నారు. ప్రధానంగా గుంటూరు-గిద్దలూరు మధ్య 200 కిలోమీటర్లు, బుగ్గనపల్లి-గుంతకల్లు మధ్య 113 కిలోమీటర్ల మేర నిరంతరాయంగా రైళ్లు నడపబడతాయని తెలిపారు. ఈ విభాగాలను డబ్లింగ్ చేయడం వల్ల రద్దీ తగ్గుతుందని తెలియజేశారు. తద్వారా గుంటూరు-గుంతకల్లు సెక్షన్‌లో రైళ్ల నిర్వాహణలో వెసులుబాటు లభిస్తుందని తెలియజేశారు. ప్రాజెక్టులోని మిగతా సెక్షన్‌లైన బుగ్గనపల్లి-గిద్దలూరు మధ్య పనులు శరవేగంగా జరుగుతున్నాయని మొత్తం ప్రాజెక్ట్‌ను డబ్లింగ్, విద్యుదీకరణ పూర్తి చేయడం వల్ల సెక్షన్‌లో రద్దీ తగ్గడమే కాకుండా రైళ్ల సగటు వేగాన్ని పెంచడంలో సహాయపడుతుందని తెలిపారు. డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడిపించేందుకు సహకరించిన ఆయా డివిజన్ విభాగాధిపతులను అభినందించారు.

ఎన్నికల వేళకు ఎగిరొచ్చేస్తారు!

- జిల్లాలో 252 మంది ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు
- మాచర్ల నియోజకవర్గంలో 52 మంది

సత్తెనపల్లి: పల్నాడులో ఫలితం ఎటు..? నరసరావుపేటలో నిలిచేది ఎవరు..? సత్తెనపల్లిలో సత్తా చాటేదెవరు..? గురజాలలో గెలుపు ఎవరిది..? చిలకలూరిపేటలో చిందేసేది ఎవరు..? పెదకూరపాడులో పెత్తనం ఎవరిది..? వినుకొండలో వాణి వినిపించేది ఎవరు..? మాచర్లలో మళ్లీ ఎలా ఉండబోతుంది..? సార్వత్రిక ఎన్నికల వేళ స్థానిక ఓటర్లలో ఆసక్తి సాధారణం. వివిధ దేశాలలో ఉన్నవారూ ఈ సమరంపై ఎక్కడా లేని ఆసక్తి చూపుతున్నారు. ఇక్కడి సంగతులు ఆన్‌లైన్, వాట్సాప్ కాల్‌లో మాట్లాడి తెలుసుకోవడానికి ఉత్సుకత చూపుతున్నారు. వారెవరో కాదండీ .. పల్నాడు జిల్లా నుంచి వివిధ ఉద్యోగాలు, ఉపాధి కోసం వెళ్లిన ఎన్‌ఆర్‌ఐలే. చాలా మంది ఎన్నికల సమయానికి స్వగ్రామాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే కొందరు పార్టీలపై అభిమానంతో వచ్చి ప్రచార వ్యూహాలకూ పదును పెడుతున్నారు.

ఓటర్లలో వీరు వేరయా..

పల్నాడు జిల్లాలో పెదకూరపాడు, చిలకలూరిపేట, నరసరావుపేట, సత్తెనపల్లి, వినుకొండ, గురజాల, మాచర్ల నియోజకవర్గాలు ఉన్నాయి. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 252 మంది ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు ఉన్నారు. ఎన్నికల సంఘం అధికారికంగా విడుదల చేసిన జాబితాలోని లెక్కలివి. అత్యధికంగా మాచర్ల నియోజకవర్గంలో 52 మంది ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు ఉంటే అత్యల్పంగా వినుకొండ నియోజకవర్గంలో 21 మంది ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు ఉన్నారు.

జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు...

నియోజకవర్గం	ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు
పెదకూరపాడు	42
చిలకలూరిపేట	34
నరసరావుపేట	28
సత్తెనపల్లి	43
వినుకొండ	21
గురజాల	32
మాచర్ల	52
మొత్తం	252

విదేశాల్లో ఉన్నా ఓటు వినియోగం

విదేశాల్లో ఉంటున్నా భారతీయులు ఓటేయడానికి అర్హులే. అక్కడి పౌరసత్వం లేని భారతీయ పౌరుడు, పౌరురాలు 18 ఏళ్లు నిండితే చాలు పాస్‌పోర్ట్ లోని భారతదేశం చిరునామా వివరాలు పేర్కొనాలి. నమోదు చేసిన ప్రాంతంలోనే నేరుగా హాజరై ఓటు వేయాలి. ఓటు కోసం ఫారం-6 దరఖాస్తు చేసుకోవచ్చు. నేరుగా ఈఆర్వోకు ఇవ్వవచ్చు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో పేర్కొన్న ఈఆర్వో చిరునామాకు పోస్టులోనూ పంపొచ్చు. పోస్టు ద్వారా పంపేవారు పాస్‌పోర్ట్ లోపల పేజీ ఫోటో, వ్యక్తిగత వివరాలు ఉన్న పేజీని ఫోటో తీసి చెల్లుబాటు అయ్యే వీసా వివరాలు జత చేసి పంపాలి. ఈ పత్రాలన్నీ మనదేశ అధీకృత అధికారి ధృవీకరించాలి. ఈఆర్వోకి వ్యక్తిగతంగా దరఖాస్తు ఇవ్వాలనుకుంటే ఒరిజినల్ పాస్‌పోర్ట్ సమర్పిస్తే పరిశీలన పూర్తయ్యాక ఇచ్చేస్తారు. పోలింగ్ రోజున ఇదే పాస్‌పోర్ట్ చూపించి ఓటు హక్కు వినియోగించు కోవచ్చు.

విలువైన రికార్డులు అపహరణ


కార్యాలయాన్ని పరిశీలిస్తున్న సీఐ లోక్‌నాథం

నగరంపాలెం: రాష్ట్ర యూనియన్ కార్యాలయంలో రికార్డులు, వస్తువులను అపహరణపై గుంటూరు యూనిట్ అధ్యక్షుడు కోటేశ్వరరావు బుధవారం రాత్రి నగరంపాలెం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. మెడికల్ కాలేజీ ఉమెన్స్ హాస్టల్ రోడ్‌లోని ఉమెన్స్ హాస్టల్ ఎదురు గుంటూరు ఎన్‌ఎస్పీపీ క్యాంప్ కాలనీలో క్వార్టర్ నంబర్ ఎఈ2లో ఏపీ ఇరిగేషన్, రోడ్స్/ బిల్డింగ్స్, పబ్లిక్ హెల్త్, పంచాయతీరాజ్/ మున్సిపల్ ఎంప్లాయిస్ స్టేట్ అసోసియేషన్ కార్యాలయం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గుంటూరు యూనిట్ అధ్యక్షుడు కోటేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి నాగేశ్వరరావు బుధవారం ఉదయం 9 గంటల సమయంలో రాష్ట్ర కార్యాలయం వద్దకెళ్లారు. కార్యాలయం ముందు, వెనుక భాగంలో ఉన్న కిటికీలు, గదుల తలుపులను పగులకొట్టినట్లు గుర్తించారు. అనంతరం లోనికెళ్లి నిశితంగా పరిశీలించగా, అందులో విలువైన రికార్డులు, వస్తువులు అపహరణకు గురైనట్లు గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా లోనికి చొరబడి వాటిని ఎత్తుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు నగరంపాలెం పీఎస్ సీఐ లోక్‌నాథం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

వాగులో పడి 30 గొర్రెలు మృతి


చనిపోయిన గొర్రెల వద్ద కాపలాదారులు

మేడికొండూరు: వాగులో పడి రూ. 10 లక్షల విలువైన గొర్రెలు వాగులో పడి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని విశదల గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం విశదల గ్రామానికి మున్నపాటి గోపి, మర్రి ఆదినారాయణ, కొక్కెర నరేష్‌లు గొర్రెలు కాచుకుంటూ జీవనం సాగిస్తుంటారు. గురువారం రాత్రి గ్రామ శివారులో రోజు మాదిరిగానే ఉదయం సమయంలో గొర్రెలు కాచుకుని తిరిగి వస్తూ వాగు దాటుతున్న సమయంలో ప్రమాదవశాత్తులో వాగులో లోతులోకి వెళ్లి గొర్రెలు మృతిచెందినట్లు బాధితులు తెలిపారు. వాటి విలువ రూ. 10 లక్షలు ఉంటుందని తెలిపారు.

ఎస్టీ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీగా జాన్‌పాల్ నాయక్



కారెంపూడి: పల్నాడు జిల్లా ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీగా కారెంపూడి తండాకు చెందిన రమావతు జాన్‌పాల్ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు నియామక పత్రాన్ని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాచర్ల శాసన సభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) గురువారం అందించారు. జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులుగా నియమితులైన జాన్‌పాల్‌నాయక్‌ను వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొమ్ము చంద్రశేఖర్, కిల్లా కాశి తదితరులు పాల్గొన్నారు.

‘పుట్టపర్తి’ సాహితీ సేవ శ్లాఘనీయం


పుట్టపర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అసోసియేట్ డీన్ డాక్టర్ స్మిత్

బాపట్ల: తెలుగు భాషాభివృద్ధికి బహుభాషా కోవిదుడు, సాహితీవేత్త పుట్టపర్తి నారాయణాచార్యులు సేవలు శ్లాఘనీయమని బాపట్ల వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టరు డి.డి. స్మిత్ పేర్కొన్నారు. నారాయణాచార్యులు జయంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ మాట్లాడుతూ నారాయణాచార్యులు తన 12వ ఏటనే రచనల్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఒక ఎగ్జామ్‌కి నారాయణాచార్యులు వెళ్లినప్పుడు ఆయన రాసిన కవిత్వమే ఆ పరీక్ష పేపర్లో వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జి.రవిబాబు, డాక్టర్ బి. జాన్ వెస్లీ, డాక్టర్ కె.వి.ఎస్. రామిరెడ్డి, డాక్టర్ జి. వీరప్రసాద్, డాక్టర్ కృపావతి, డాక్టర్ లావణ్య, డాక్టర్ ఎస్. అశోక్ కుమార్ పాల్గొన్నారు.

నేడు అండర్-20 బాలుర ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న మధ్యాహ్నం 3 గంటలకు సత్తెనపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో అండర్-20 బాలుర ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు జరుగుతాయని పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యేశ్వరరావు గురువారం తెలిపారు. 2005-07 మధ్య జన్మించిన క్రీడాకారులు ఎంపికలకు అర్హులన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు జనన ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు వెంట తీసుకురావాలన్నారు.

గుడ్ ఫ్రైడే



క్రీస్తు విధేయతా బలియాగం

క్రీస్తు మరణ, సమాధి, పునరుత్థానాల వెనుక దేవుని దివ్య సంకల్పం ఉంది. దీన్నే సువార్త అంటారు. సువార్త దేవుని సంకల్పంతో ఎప్పుడూ ముడిపడే ఉంటుంది. పూర్వపు దేవుని సంకల్పం చెప్పక దాన్ని దాటవేసే సువార్త అసలు లెస్సయైన లేఖనానుసార సువార్తగా ఎప్పటికీ కానేరదు. సువార్త పుట్టుకకు ఆయువుపట్టు వంటి దేవుని ప్రణాళికను చాలా పకడ్బందీగా, పటిష్టంగా వివరించకున్ననూ అది సువార్త కాదు. సత్యవాక్యం అనే రక్షణ భాగ్యపు సువార్త ప్రకటన అపొస్తలుల బోధకు లోబడే ఉండి తీరాలి.

ఈ జగత్తుకు పునాది వేయక పూర్వమే దేవుని ఆలోచనలలో ఉన్న క్రీస్తు బలియాగం అనే 'పథక రచన' గూర్చి ఎంతగా చెప్పుకొన్నా, అది తక్కువే. తన ప్రజల పాప పరిహారార్థం అద్వితీయ జ్ఞానసంపన్నుడైన దేవుడు అనాదిలోనే క్రీస్తు పరిశుద్ధ రక్తానికి రూపకల్పన చేయడం జరిగింది. అప్పటికి ఇంకా మానవ సృష్టి జరగలేదు. భూలోకమే లేదు. భూమి మీద మనుష్యుల జాడే లేదు. పాపమే లేదు. దీన్నే క్రీస్తు కేంద్రంగా చేయబడిన దేవుని నిత్య సంకల్పంగా చెబుతారు. క్రీస్తు లేకుంటే దేవునికి సంకల్పమే లేదు అనేంత ఉన్నతం గా దీన్ని గూర్చి చెప్పుకోవడం మాత్రం అసాధారణం. తండ్రియైన యెహోవా దేవుడు తన నీతిని బట్టి సంతోషం గలవాడై ఘనపరచి గొప్ప చేసిన ఉపదేశ క్రమం సంబంధిత సంకల్పాన్ని మించిన భావజాలం లేదా భావ సంపద మరొకటి లేదంటారు.

దేవుని దృష్టి కోణంలో దేవుని మనస్సుతో దేవుని గ్రంథాన్ని లోతుగా అధ్యయనం చేసే వారికి ఒక విషయం తేటగా అర్థం అవుతుంది. అదేమిటంటే, దేవుడు అన్యాయం చేయుట అసంభవం అనునదే. ఈ సత్యాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకొన్నవారే ఆత్మ సంబంధులు. బలిని కాక కనికరమునే కోరే దేవుడు ప్రారంభంలో జంతుబలులను ఏర్పాటు చేసినా కూడా యుక్త కాలాన తన సొంత కుమారుడను బలిగా అర్పించుట ద్వారా ఇలా పాపవ్యాప్తి నివారణకు మేలైన శాశ్వత పరిష్కారం కనుగొని జంతు బలులకు చరమగీతం పలికాడు. యూదులకు చాలా సహజంగా సామాన్యంగా చెప్పే సత్యం ఒకటుంది. రక్తం చిందింపకుండా పాప క్షమాపణ కలుగదు. ఇది నమ్మే యూదులు మెస్సీయ బలిని కనులారా చూడటం ద్వారా విస్మయానికి గురయ్యారు. మహాదేవుని సంకల్పానికి బహు ముగ్ధులై ఐశ్వర్య భయంతో వినయ సంపన్నులైన వారంతా తలలు వంచి దేవుని పాదాల చెంత సాగిలపడ్డారు. మానవాళి అంతా పుట్టారు కాబట్టి చనిపోతారు. యేసుక్రీస్తు మరణించడానికే పుట్టాడంటూ పండిత పెద్దలు పదే పదే చెబుతుంటారు. ఇదే ఆయన జీవితం ప్రత్యేకత. ఇలాంటి జీవితం ఈ భూమి మీద ఏ ఒక్కరికీ లేదన్నదే సుసమాచారం. క్రీస్తు ఈ లోకానికి చెప్పశక్యం కాని ఒక వరంగాను ఆయన సాహసోపేత విధేయత తాలూకు ప్రాణత్యాగం మానవాళి పాలిట శుభవార్తగానూ చరిత్రకెక్కిందనేది గమనార్హం. బాల్యం నుండే కాక, మూడున్నర సంవత్సరాల తన యౌవన కాలమంతా దేవునికి వెచ్చించి విధేయుడైన వాడై తన్ను తాను దేవునికి అర్పణగా సమర్పించుకున్నాడు. 'నీ చిత్తమే సిద్ధించును గాక!' అంటూ మరణానికి ఎదురుగా వెళ్ళిన అరుదైన జీవితం క్రీస్తు ప్రభువుది.

లోక పాపాలను మోసుకొనిపోయే దేవుని గొఱ్ఱె పిల్లగా, పస్కా బలి పశువుగా క్రీస్తును అభివర్ణిస్తుంది పరిశుద్ధ బైబిలు. దేవునికి అవిధేయులైన మానవాళి పాపాలు గొఱ్ఱె పిల్లపై మోపబడ్డాయి. ఫలితంగా గొఱ్ఱెపిల్ల మరణించింది. క్రీస్తుకు ఇందుకొరకే శరీరం ఇవ్వబడింది లేదా అమర్చబడింది. దేవుని ప్రజల పాపాలకు ప్రతిగా వారి పక్షాన సిలువలో క్రీస్తు శరీరాన్ని శిక్షకు గురి చేయడం ద్వారా దేవుని ప్రజలు తమ తమ పాపాల నుండి విమోచించబడి పరిశుద్ధులయ్యారు. క్రీస్తు మరణం వెనుక దాగిన సువిశేష పరమార్థం ఇదే. మానవ ప్రారంభ ఆదాము అనే ఒకని అవిధేయత ద్వారా లోకంలోనికి పాపం ప్రవేశించింది. కడపటి ఆదాము అనే ఒకని విధేయత ద్వారా యావత్తూ అవిధేయ మానవాళికి రక్షణ భాగ్యం సంప్రాప్తించింది. వారంతా కొత్త జన్మతో నూతన సృష్టిగా పరివర్తన చెందారు. ఆ కడపటి ఆదామనే క్రీస్తు సాహసోపేత జీవిత విధానమే ఎల్లరకు పరిశుద్ధ జీవితాలను అనుగ్రహించింది.

ఈ దిగువ గల యెషయా భవిష్యత్ ప్రవచనం దాని వర్ణన అత్యున్నతమైన క్రీస్తు విధేయత జీవిత సారాన్ని అసాధారణ రీతిలో వెల్లడి చేయుట అనేది మనస్సు పెట్టి గమనించదగ్గది. బలి యాగంలో క్రీస్తు చూపిన విధేయత ఇప్పటికీ వేనోళ్ళ కొనియాడబడుతునే ఉండుట బహు ఆశ్చర్యకరం! ఈ ప్రవచనం క్రీస్తు నందు నెరవేరింది.

''అతడు దౌర్జన్యము నొందెను
బాధింపబడినను అతడు నోరు తెరువలేదు
వధకు తేబడు గొఱ్ఱె పిల్లయు
బొచ్చు కత్తిరించు వాని యెదుట గొఱ్ఱెయు
మౌనముగా నుండునట్లు
అతడు నోరు తెరువ లేదు
అన్యాయపు తీర్పు నొందిన వాడై
అతడు కొనిపోబడెను
అతడు నా జనుల యతిక్రమమును బట్టి
మొత్తబడెను గదా''

ఈ అరుదైన సృష్టిలో, బిడ్డను నవ మాసాలు మోసిన కన్న తల్లి అతన్ని భూమి మీద విడిచి పెట్టి కన్ను మూసింది. అతడు పెద్దవాడై తన తల్లి పట్ల నిత్యమూ కృతజ్ఞతాభావం కలిగిన వాడై ఆమె ఆలోచనలు, ఆశయాలు అన్వేషిస్తూ వాటి సాధనలో నిత్యమూ నిమగ్నమవడమే కాకుండా, తన తల్లి వలె ఏ ఒక్కరూ రక్త హీనతతో చనిపోకుండా పుష్టినిస్తూ బలవృద్ధి కలుగజేసే బహు మేలైన ఉచిత సేంద్రీయ సహజాహార పంపిణీకి దృఢ సంకల్పంతో నడుం కట్టాడు. తన తల్లి మరణాన్ని ఒక పండుగగా, వేడుకగా మలిచే పనిలో సత్క్రియల యందాసక్తితో అతడు సమాజంతో ప్రేమలో పడ్డాడు. 'ఆమె మరణించి మనకు దూరం కాలేదు. ఇదిగో ఇక్కడే ఉంది నవ్వుతూ' అన్న భావనను కుటుంబంలోను, బంధు మిత్రులలోనూ ఆమె కొడుకు కలుగజేసిన వైనం అతనిదైన సృజనాత్మక కళాత్మక పనితనమనే చెప్పాలి. అది చూసి ఊరు ఊరంతా ఆ మహాతల్లి త్యాగం వూరికే పోతుందా అనే వారే అంతటా. తన మాతృమూర్తి ప్రేమను అతడు సెలబ్రేట్ చేయబూనే వైవిధ్య విధానానికి తెరలేపడం వలన అంతా మంత్రముగ్ధులయ్యేలా అది ఊరంతా పెద్ద చర్చనీయాంశంగా మారింది. అమ్మ అజెండా సాధనే ధ్యేయంగా పిల్లవాడి ప్రయాసకు అంతా జత కలిశారు.

యేసు ప్రాణ త్యాగం అచ్చు ఇలాంటిదే. సెలబ్రేట్! జీసస్ సెలబ్రేట్!

– జేతమ్

వారపు ప్రప్రథమ దినం అనే ప్రతి ఆదివారం నాడు యెడతెగక దేవుని ఆరాధనలో భాగంగా జరిగే రొట్టె విరుచుట అనేది క్రీస్తు బలియాగానికి గుర్తు. క్రీస్తు పస్కా బలి పశువుగా, వధకు సిద్ధమైన గొఱ్ఱెపిల్లగా అనాదిలోనే దేవుని చేత నిర్ణయించబడినవాడు. అది క్రీస్తు మరణంతో నెరవేరుటను నేడు మనం చూస్తున్నాం. క్రీస్తు వారి నలగగొట్టబడిన శరీరానికి గుర్తుగా రొట్టెను, మానవాళి కొరకు చిందించబడిన పవిత్ర రక్తానికి గుర్తుగా ద్రాక్షరసాన్ని... ఇలా రెండింటిని కృతజ్ఞతాపూర్వక ప్రార్థనలతో తీసుకుంటూ ప్రభువు వచ్చువరకు ఇలా చేస్తూ క్రీస్తు సిలువ యాగాన్ని గుర్తుకు తెచ్చుకుంటుంది క్రీస్తు ప్రభువు వారి సంఘం. నిజానికి ఇది భోజనం, పానం కాదు. నీతి, సమాధానం, పరిశుద్ధాత్మ సంబంధిత ఆత్మానందం ఇహమందు కాక ఈ లోక సంబంధులుగా కాక పరలోక సంబంధులుగా సంఘమనే దేవుని రాజ్యంలో జరుపుకొనే పండుగ. సంఘ భవనంలోనే ఇది జరిగినా కూడ సత్య లేఖనాల సారం ప్రకారంగా ఇది ఇహమందు అద్వితీయ సత్యదేవుడు, ఆయన నియమించిన రాజు ప్రధాన యాజకుడైన క్రీస్తు వారి సమక్షంలో జరిగే అత్యున్నత సంఘ కార్యక్రమం. సంఘం అంటే పరిశుద్ధులుగా ఉండుటకు పిలువబడిన వారని అర్థం. ఇట్టి ఆదివారపు దేవుని ఆరాధనతో సంఘం పరిశుద్ధంగా, ఆత్మ సంబంధంగా అన్నింటా బలపడుతూ ఉంటుంది.




ఒకనాడు దేవుడు ఆజ్ఞాపించి చేయమన్న ఇహలోక భూ భౌతిక సంబంధ పండుగల కంటె మిన్నగా ఆత్మ సంబంధ పండుగను ఒకటి నిర్ణయించి నేడు ఉన్నతంగా ఆచరించమని తన గ్రంథం ద్వారా ఆజ్ఞాపిస్తున్నాడు. అదే క్రీస్తు పస్కా పండుగ. ఇది హృదయానందానికి సంబంధించినది. ఇది ఎక్కడా ప్రసిద్ధి చెందినట్లుగా బహు ప్రాచుర్యంలో ఉన్నట్టుగా లోకంలో కనబడదు. క్రీస్తు పస్కా పండుగ ఒకటి ఉందనేది లోకానికి తెలియదు. ఎందుకంటే ఇది ఆత్మసంబంధమైనది. దేవుని రాజ్యం దానిని పొందిన వారి అంతరంగానికి మాత్రమే అందే కార్యం. ఇది తన తోటి వారికి, పక్కవారికి, అన్యులకు ఏనాడూ అంతు చిక్కని కార్యం. ఇది జీవం గల దేవుని సంఘంలో క్రీస్తును బట్టి క్రీస్తు ద్వారా క్రీస్తునందు జరిగే ఉన్నతమైన కార్యక్రమం.

● ముత్తు నందిని ప్యాలెస్

ఇష్టాల ఇల్లు

రాజ్ చందర్ పద్మనాభన్, నాగ జయలక్ష్మి దంపతులు తమిళనాడు రాష్ట్రం, కన్యాకుమారిలో నివసించేవారు. సొంత ఇంటి కలను నెరవేర్చుకునే క్రమంలో వీరు అనుసరించిన విధానం ఇప్పుడు దేశమంతటినీ ఆకర్షిస్తోంది. పర్యావరణ ప్రేమికులనైతే మరీ ఎక్కువగా ఆకట్టుకుంటోంది. రెండేళ్ల కిందట గృహప్రవేశం చేసుకున్న కొత్త ఇల్లది. అయితే ఆ ఇంట్లో అడుగుపెడితే కాలం గిర్రున సినిమా రీల్‌లాగ వందేళ్ల వెనక్కి తిరిగిపోయిందా అనిపిస్తుంది. ఇంటిని చూడడానికి వచ్చిన వాళ్లను అతిథి మర్యాదలతో ముంచెత్తుతారు ఈ దంపతులు. సేంద్రియ పద్ధతిలో పండించిన దినుసులు, కాయగూరలతో సంప్రదాయ తమిళ, చెట్టినాడు వంటలను వడ్డిస్తారు.





నాగ జయలక్ష్మి, రాజ్ చందర్ పద్మనాభన్

పర్యావరణహిత భవనం ముత్తు నందిని ప్యాలెస్





ఎర్రమట్టి, సున్నపు రాయితో నిర్మించిన ఇంట్లో భూగర్భ జలాలను పరిరక్షించే ఏర్పాటు ఉంది. బంకమట్టి నిర్మాణం కావడంతో ఎండాకాలం చల్లగా ఉంటుంది. నేచర్ ఫ్రెండ్లీ ట్రావెల్‌ను ఇష్టపడే వాళ్లు ఇక్కడ బస చేస్తుంటారు. బస చేయకపోయినా చూసి పోవడానికి వచ్చేవాళ్లు కూడా ఎక్కువగానే ఉంటారు. ఈ కాలంలో ఇంటిని ఇలా ఎందుకు కట్టుకున్నారనే ప్రశ్న దాదాపుగా ప్రతి ఒక్కరి నుంచి ఎదురవుతుంటుంది. జయలక్ష్మి ప్రతి ఒక్కరికీ పూసగుచ్చినట్లు వివరిస్తుంటుంది.

బాల్యంలోకి వెళ్లారాయన!

''రాజ్‌చందర్ వృత్తిరీత్యా జియో డాటా అనలిస్ట్. ఆయనకు ఇష్టమైన రోజులంటే చిన్నప్పుడు వాళ్ల అమ్మమ్మ గారింట్లో గడిపిన బాల్యమే. పైగా రాజ్ అభిరుచి, విధి నిర్వహణ కూడా పర్యావరణవేత్తలతో కలిసి పని చేయడమే. ఈ రెండు ఇష్టాలను కలుపుతూ చక్కటి ఇల్లు కట్టుకోవాలని ఎప్పుడూ చెప్పేవారు. నాక్కూడా మా సంప్రదాయ నిర్మాణంలో ఉండే సౌందర్యం చాలా ఇష్టం. ఇద్దరి అభిరుచులూ కలవడంతో ఇంటిని ఇలా కట్టుకున్నాం. మా ఇద్దరి ఇష్టాల మేరకు ఎలా కట్టుకోవాలో ఒక ఐడియా వచ్చేసింది. ఎక్కడ కట్టాలనే విషయంలో ఒక అభిప్రాయానికి రావడం కొంచెం కష్టమే అయింది. లొకేషన్ సెర్చింగ్ మొదలు పెట్టాం.

సంజీవని శకలం

కన్యాకుమారికి సమీపంలో పోథయాడి గ్రామాన్ని చూసినప్పుడు కొండలు, పచ్చటి చెట్లతో ప్రదేశం బాగుందనిపించింది. ఆశ్చర్యంగా మరో విషయం తెలిసింది. అదేంటంటే... రామాయణంలో లక్ష్మణుడు మూర్ఛపోయినప్పుడు వైద్యం కోసం హనుమంతుడు ఏకంగా సంజీవని మొక్క ఉన్న పర్వతం అంతటినీ ఎత్తుకొచ్చాడని విన్నాం. వైద్యం చేసిన తర్వాత ఆ పర్వతాన్ని తిరిగి తీసుకెళ్లే క్రమంలో పర్వతంలోని ఒక శకలం విరిగి కింద పడి పోయిందని, ఆ శకలమే ఈ కొండ అని చెప్పారు స్థానికులు. వాళ్ల విశ్వాసాన్ని పక్కన పెడితే ఆ కొండమీద చుట్టుపక్కల ఉన్న మొక్కలన్నీ ఔషధ మొక్కలే. ప్రకృతితో మమేకమై నివసించడానికి మాకు ఇంతకంటే సౌకర్యవంతమైన ప్రదేశం మరోటి ఉండదేమో అనిపించింది. అంతే... 2021లో నిర్మాణం మొదలు పెట్టాం. ఒక ఏడాదిలో తమిళ, వేనాడు, చెట్టినాడు సంస్కృతుల సమ్మేళనమైన మా ఇంటి నిర్మాణం పూర్తయింది. సంప్రదాయ కళాకృతుల సేకరణ నా హాబీ. ఇంటిని తమిళ సంప్రదాయ సంస్కృతికి ప్రతీకగా మలిచాను. ఇంటి ముఖద్వారం నుంచి నేల, గోడ, మెట్లు, పై కప్పు, అలంకరణ వస్తువులు ప్రతి ఒక్కటీ తమ వైభవాన్ని తామే చెప్పుకుంటాయి. పర్యావరణ హితమైన సున్నపు పొడి ఇటుకలు, ఎర్ర మట్టి, ఆవుపేడ, ధాన్యం పొట్టు, కోడిగుడ్లు, బెల్లంతోపాటు అత్తంగుడి నది తీరాన దొరికే ఇసుకతో తయారు చేసే అత్తంగుడి టైల్స్‌ను వాడాం. పై కప్పుకి కాంక్రీట్ వాడకాన్ని తగ్గించి ఫిల్లర్ స్లాబ్ టెక్నిక్ ఉపయోగించాం. వర్షపు నీటిని నిల్వ చేయడానికి రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్, కరెంటుకోసం సోలార్ ప్యానెల్స్ పెట్టాం. ఈ మట్టి సౌధంలో 5 బెడ్ రూమ్‌లు, మూడు బాల్కనీలు, మూడు లివింగ్ స్పేస్‌లు ఉన్నాయి. ఇప్పటి వరకు రెండు వందల మందికి పైగా పర్యాటకులు ఈ హోమ్ స్టేలో బస చేశారు. ఆహారం కూడా తమిళనాట ప్రాంతాల వారీగా విలసిల్లిన విభిన్నమైన రుచులుంటాయి. ఇంటి ఆవరణలో అన్ని రకాల కూరగాయలనూ పండిస్తాం. వంటగదిలో వచ్చే వ్యర్థాలనే ఎరువుగా వేస్తాం'' అని తమ పర్యావరణ హిత భవనం ముత్తు నందిని ప్యాలెస్ గురించి వివరించింది జయలక్ష్మి.

పరివర్తన

ఇప్పుడవి రాళ్లు విసిరే చేతులు కాదు

ఆ అమ్మాయి ఒకప్పుడు గుంపులో రాళ్లు విసిరే కశ్మీరీ అమ్మాయి. ఇప్పుడు జమ్ము-కశ్మీర్‌లో కేవలం బాలికల కోసం ఫుట్‌బాల్ అకాడెమీ నడుపుతున్న ప్రొఫెషనల్ ఫుట్‌బాల్ ప్లేయర్. ఆమెలో వచ్చిన మార్పు ఆమెను ప్రధాని నరేంద్ర మోదీ చేత కూడా మాట్లాడించేలా చేసింది. విరాట్ కోహ్లీ కూడా ఆమెను మెచ్చుకున్నాడు. యువతకు సరైన దిశ ఉంటే వారు గెలిచి తీరుతారనడానికి అఫ్షాన్ ఆషిక్ ఒక ఉదాహరణ.

కొన్నేళ్లు వెనక్కు వెళితే 2017 డిసెంబర్‌లో ఒక ఫోటో వైరల్ అయ్యింది. ఒకమ్మాయి... ముఖానికి దుపట్టా కట్టుకుని జమ్ము కశ్మీర్ పోలీసులపైకి రాళ్లు విసురుతున్న ఫొటో అది. ఆ అమ్మాయి పేరు అఫ్షాన్ ఆషిక్. ముఖం కనబడకుండా గుడ్డ కట్టుకోవడంతో తనను ఎవరూ గుర్తుపట్టరని అఫ్షాన్ భావించింది. కానీ తర్వాత ఆమె గురించి అందరికీ తెలిసిపోయింది. సమాజం ఆమెపై 'స్టోన్ పెల్టర్' ముద్ర వేసింది. అప్పటికే ఆ అమ్మాయి ఫుట్‌బాల్ ఆటలో ప్రతిభ కనపరుస్తూ ఉంది. కాని ఈ ఫోటోతో ఆమె తన ఆటకే దూరమయ్యే స్థితి వచ్చింది.

'ఆ రోజు నేను పోలీసుల మీద రాళ్లు రువ్వాను. అది కోపంలో చేసిన పని. దానికి కారణం పోలీసులు అకారణంగా మమ్మల్ని వేధించారు. విద్యార్థులను విచక్షణారహితంగా కొట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో మమ్మల్ని మేము కాపాడుకోవడానికి రాళ్లు విసరడం మినహా మాకు గత్యంతరం లేదు. నేనేమి ప్రొఫెషనల్ స్టోన్ పెల్టర్‌ను కాదు. కాని నా మీద ముద్ర పడింది. దాని నుంచి బయటపడాలంటే నేను నా చదువు మీద నా ఫుట్ బాల్ ఆట మీద దృష్టి పెట్టి విజయం సాధించాలని అనుకున్నాను' అంది అఫ్షాన్ ఆషిక్.

ఈ ఘటన తర్వాత ఆ అమ్మాయి నెల రోజులు ఇంటికే పరిమితమైంది. అఫ్షాన్ తండ్రి ఆమెను ఇంటి నుంచి బయటకు వెళ్లనీయలేదు. అరగంటపాటు ఆడుకుని వచ్చేస్తానని తల్లికి మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోయింది. 'ఒకరోజు చాలా ఏడుస్తుంటే నన్ను చూసిన నాన్న ఎందుకు ఏడుస్తున్నావని అడిగారు. ఇంట్లో కూర్చుని ఏం చేయాలని ప్రశ్నించాను. ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు అనుమతించడంతో మళ్లీ ఆట మొదలుపెట్టాను' అందామె.

ముంబై వెళ్లి

కశ్మీర్ యువత తమ చదువు, క్రీడల పట్ల దృష్టి పెట్టాలని భావించిన ప్రభుత్వం అఫ్షాన్‌ను తగిన ప్రోత్సాహం అందించింది. జమ్మూ కశ్మీర్ క్రీడాశాఖ చేయూతతో అఫ్షాన్ ముంబై వెళ్లి ఆటలో శిక్షణ తీసుకుంది. ఆ తర్వాత జమ్ము కశ్మీర్ నుంచి తొలి ప్రొఫెషనల్ ఫిమేల్ ఫుట్‌బాల్ ప్లేయర్ అయ్యింది. 'నువ్వు ఆడపిల్లవి. ఫుట్‌బాల్ నేర్చుకుని ఏం చేస్తావ్ అని అందరూ అడిగేవారు. నేను ఆడే సమయానికి ఆడపిల్లలు ఎవరూ మా ప్రాంతం నుంచి ఫుట్‌బాల్‌లోకి రాలేదు. కాని నేను ఆగలేదు. పట్టుదలగా ముందు కెళ్లాను. ఇండియన్ విమెన్స్ లీగ్‌లో ఆడాను. గోల్ కీపర్‌గా విశేష ప్రతిభ కనపరిచాను. ఆ సమయంలో విదేశీ మహిళా ఫుట్‌బాల్ ప్లేయర్లని గమనించాను. వాళ్లకు చాలా మంచిశిక్షణ ఆ దేశాల్లో లభిస్తోంది. మా ప్రాంతం బాలికలకు కూడా లభించాలని భావించాను. అందుకే జమ్ము కశ్మీర్ బాలికల కోసం యునీక్ ఫుట్‌బాల్ అకాడెమీ స్థాపించాను' అని తెలిపింది అఫ్షాన్.



అఫ్షాన్ ఆషిక్



ఆరోజుల్లో రాళ్లు విసురుతున్న అఫ్షాన్ ఆషిక్

మరింత గుర్తింపు

నేడు జమ్ము కశ్మీర్‌లో మహిళా ఫుట్ బాల్ పేరు చెప్తే అఫ్షాన్ పేరే అందరికీ గుర్తుకొస్తుంది. ఆమెకు అక్కడ ఒక సెలబ్రిటీ హోదా ఉంది. 'నేను నా గతాన్ని జయించాను. ఇప్పుడు నేను స్టోన్ పెల్టర్‌ని కాను. గోల్ కీపర్‌ని. ఇకపై నన్ను జనం అలాగే గుర్తు పెట్టుకుంటారు' అంటుందామె.